జోరందుకున్న వరి నాట్లు



గుంటపల్లి గ్రామం వద్ద వరి నాట్లు వేయడం కోసం దమ్ము చేస్తున్న ట్రాక్టరు

- కూలీల కొరత
- అయినా 80 శాతం నాట్లు పూర్తి
- చెరువులు, వరాహనదిలో జలకళ

ఎస్.రాయవరం : మండలంలో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలో సాధారణ విస్తీర్ణం 8 వేల ఎకరాలు కాగా , 80 శాతం నాట్లు పూర్తయినట్టు ఏవో సౌజన్య తెలిపారు. సైతారుపేట, సర్వసిద్ధి, పేటసూదిపురం, ఉప్పరాపల్లి, వాకపాడు, వెంకటాపురం గ్రామాల్లో మినహా మిగిలిన గ్రామాల్లో జోరుగా నాట్లు వేస్తున్నారు. అయితే ఈ గ్రామాల్లో నాట్లు వేగం పుంజుకోవడంతో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడింది. నాట్లు వేసే మడులకు గట్లు సరి చేసేందుకు మగ కూలీలు జోడాలుగా చేసే పని ఒక్కొక్కరుగా చేసుకోవాల్సి వస్తుంది. అలాగే నాట్లు వేసే మహిళా కూలీలను పొరుగు గ్రామాల నుంచి ఆటోల్లో తీసుకువచ్చి అదనంగా కూలీ ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు. దీంతో ఖరీఫ్ నాట్లు జోరు ఎక్కువగా ఉంది. ఈ నెల చివరి నాటికి దాదాపుగా నాట్లు పూర్తి అవుతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా పొలం పనులు

పాయకరావుపేట : మండలంలో ముమ్మరంగా వరి నాట్లు జరుగుతున్నవి. కూలీలకు చేతి నిండా పని ఉంటుంది. మండలంలో 2675 హెక్టార్లలో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. తాండవ నది ద్వారా మండలంలో గల 24 గ్రామాల్లో రైతులకు పంటలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. తాండవ నదిపై నిర్మించిన భూమి, ముఠా ఆనకట్టల ద్వారా రైతులకు సాగునీరు సరఫరా జరుగుతుంది. భూమి ఆనకట్ట ద్వారా పాయకరావుపేట, అరట్లకోట, నామవరం, గుంటపల్లి, పీఎల్ పురం, సీతారాంపురం గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. ముఠా ఆనకట్ట ద్వారా మంగవరం, సత్యవరం, మాసాహేబుపేట, గోపాలపట్నం , పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కుమారపురం, ఎస్.నర్సాపురం, రాజవరం, కేశవరం, తదితర గ్రామాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. మండలంలో గల ఆయా గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేసేస్తున్నారు. 2675 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంలో వరి నాట్లు వేయవలసివుండగా, ఇప్పటికే 65 శాతం వరి నాట్లు పూర్తి చేశారు. మిగిలిన 35 శాతం ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయడం జరుగుతుంది. దమ్ము పట్టే ట్రాక్టర్లకు పని దొరకడంతో ట్రాక్టరు డ్రైవర్లు కూడా బిజీగా వున్నారు. వరి నార్లు తీయడంలో కూలీలకు పని దొరికింది. సాగు నీరు సరఫరా సక్రమంగా జరగడం వల్ల, వరి నాట్లు సకాలంలో వేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చినగుమ్ములూరులో నాట్లు వేసిన దృశ్యం



మాసాహేబుపేట గ్రామంలో వరి నాట్లు వేస్తున్న దృశ్యం



కొరుప్రోలు నాట్లు వేసే పొలానికి గట్టు సరి చేస్తున్న రైతు

వాతావరణం అనుకూలం



మండలంలో ఖరీఫ్ నాట్లు జోరుగా వేస్తున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందిస్తున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు లేకపోయినా తదుపరి పడిన వర్షాలకు అన్ని చెరువులు నిండాయి. వరాహనది ప్రవాహంతో ఉంది. నాట్లుకు వాతావరణం అనుకూలంగా ఉంది.

సౌజన్య,
వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం

మాజీ సీఎంను కలిసిన మహిళా ఎంపీటీసీలు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మహిళా ఎంపీటీసీలు

మునగపాక : మునగపాక మండలం మహిళా ఎంపీటీసీలు మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా ఎంపీటీసీ సభ్యురాలు మొల్లేటి కృష్ణవేణి(ఉమ్మలాడ), శరగడం అప్పలనర్సమ్మ(తిమ్మరాజుపేట), బొడ్డేడ హైమావతి(అరబుపాలెం), కర్రి సంజీవి(పల్లపు ఆనందపురం) తదితరులు మాజీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతి రైతు దేశభక్తి చాటాలి



తిమ్మరాజుపేటలో జాతీయ జెండాల ప్రదర్శన

మునగపాక: ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జేవీఎస్ రాజు కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేట వ్యవసాయ క్షేత్రంలో జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాల కారణంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు రైతులకు కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో యలమంచిలి అసెంబ్లీ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, పార్టీ నాయకులు మళ్ల రామజోగి నాయుడు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న దుర్గాలమ్మ తల్లి పండగ

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఈ నెల 15న దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ఒకప్రకటనలో తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



తిమ్మరాజుపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా అమృత వర్షిణి కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. ఏపీవో ఎరకయ్య, వీఆర్వో రమేష్, పంచాయతీ కార్యదర్శి రమణారావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఫాగింగ్



వాడ్రాపల్లిలో దోమల మందు ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక : వాడ్రాపల్లిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాడ్రాపల్లిలో ఆయన దోమల మందు ఫ్యాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిలువ ఉన్నా, కాలువలు శుభ్రంగా ఉంచుకోలేక పోయినా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు.

మొక్కల పెంపకానికి ప్రణాళికలు



జేవీ పాలెం నర్సరీలో అందుబాటులో వున్న మొక్కలు

యలమంచిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించామని ఎంపీడీవో అప్పలనాయుడు చెప్పారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అమ్మ పేరున ఒక మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 గ్రామాల్లో 1500 మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు ఈ ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. చెరువు గట్లపైన, శ్మశానాల్లోనూ, గ్రామాల్లోని పలు ఖాళీ ప్రదేశాల్లో ఈ మొక్కలు నాటుతామని చెప్పారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

నర్సీపట్నం: ఇండిపెండెన్స్ డేను పురస్కరించుకుని డినెట్ స్పోర్ట్స్ గ్రౌండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు మంగళవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మాంటిసోరి, నలంద జట్లు తలపడగా మోంటిసోరీ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

మాజీ మంత్రి బొత్సను కలిసిన నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా విశాఖపట్నంలో మంగళవారం సాయంత్రం కలిశారు. బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంలో ఆయనను వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఎంపీటీసీలు కొంతం నరేష్, నాయకులు యగదాసు శేఖర్, నీలాం మహేష్‌రెడ్డి, పాలపర్తి సతీష్ పాల్గొన్నారు.



బొత్సను మర్యాద పూర్వకంగా కలిసిన పార్టీ నాయకులు

చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలి..

కోటవురట్ల : విద్యార్థి దశలోనే న్యాయ వ్యవస్థ ,చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ అన్నారు. స్థానిక కేజీబీవీలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ కేజీబీవీ పరిసరాలు, డార్మెటరీ, కిచెన్, వాష్‌రూమ్స్, క్లాస్‌రూమ్స్ పరిశీలించారు. వంటకాల నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశమై వారి పరిజ్ఞానంపై పలు ప్రశ్నలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పిస్తూ చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే న్యాయం కోసం ధైర్యంగా పోరాటం చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా బాలికలు, మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, సమస్య ఎదురైనపుడు ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. వేధింపులు ఉన్నపుడు కుంగిపోయి భయపడకుండా పోలీసు యంత్రాంగం, న్యాయ వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సరితాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

రాంబిల్లి (యలమంచిలి) : ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలని రాంబిల్లి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కారే రాముడు పిలుపునిచ్చారు. మంగళవారం రాంబిల్లి మండలంలో బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ధర్మాల గోవింద రెడ్డి మట్లాడుతూ రాంబిల్లి మండలంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగారవేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగేలా చూడాలని భారతీయ జనతాపార్టీ సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగమంత్రి శ్రీనివాసరావు, ఉమ్మిడి వెంకటేశ్వర్లు, సూరాడ ధర్మతేజ, సూరాడ నూకరాజు, చింతకాయల యర్రయ్య, వానసెట్టి గంగరాజు, ఎరిపిల్లి సత్యారావు, కోసూరి మహేష్ పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పలు గ్రామాల్లో వర్షం.. రైతుల హర్షం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. గత నెలలో కురిసిన వర్షాలకు పంట భూముల్లో చేరిన నీటితో పల్లపు భూముల్లో దమ్ములు ముగించుకున్నారు. సమీప చెరువుల్లో నీటిని యంత్రాల సాయంతో భూముల్లోకి చేర్చి కొమరవోలు, శరభవరం, రోలుగుంట, లగుడు కొత్తూరు గ్రామాల్లో నాట్లు వేసుకున్నారు. జేపీ అగ్రహారం, వెలంకాయలపాలెం, కొంతలం తదతర మెట్ట ప్రాంతాల్లో మాత్రం నీరు చాలినంత లేక, నారు ఉన్నా దమ్ములు జరగలేదు. ఈతరుణంలో కురిసిన వర్షం పంట చేలకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

రూ 3.8 లక్షలతో పూడికతీత పనులు

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: సాగునీటి కాలువలో పూడికతీత పనులు చేపట్టేందుకు రూ. 3.80 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు నీటిపారుదల శాఖ డీఈఈ సుజాత చెప్పారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన అధికారుల నిర్లక్ష్యం-రైతులకు శాపం వార్తకు ఆమె స్పందించారు. జూలై 15 నాటికి సాగునీటి కాలువ ద్వారా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేరుకుపోయిన పూడికలు తొలగించడంతో పాటు ఖరీఫ్‌లో రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి..



లింగాపురంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల: స్వచ్ఛ గ్రామాల కోసం చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగించాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ తెలిపారు. లింగాపురంలోని చెత్త నుంచి సంపద కేంద్రం యూనిట్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. గ్రామాలలోని చెత్తను సంపద కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలలో నిల్వ చేయాలన్నారు. సేంద్రియ ఎరువును తయారు చేసి వాటి వినియోగానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు సూచించారు.

బంగారమ్మతల్లి సన్నిధిలో హోంమంత్రి

ఎస్.రాయవరం : మత్స్యకారుల ఆరాధ్య దైవం అయిన బంగారమ్మతల్లిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకున్నారు. ఎన్నికల్లో గెలిస్తే రేవుపోలవరం బంగారమ్మకు మొక్కు చెల్లించుకుంటామని ఆ గ్రామ నాయకులు ఎన్నికల ప్రచారం అమ్మవారిని వేడుకున్నారు. ఈ మేరకు మంత్రి అయిన అనిత అమ్మవారికి చీర సారె సమర్పించి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు.

రైతులు సాగు మెలకువలు తెలుసుకోవాలి

పాయకరావుపేట : రైతులు పంటల పట్ల సులభ పద్ధతులు, మెలకువలు నేర్చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఉమా ప్రసాద్ అన్నారు. ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందితో సత్యవరం గ్రామంలో రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ ఎ.ఉమా ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటల పట్ల సమగ్ర సంరక్షణ, కలుపు యాజమాన్యం, ఎరువులు ఉపయోగంపై అవగాహన కల్పించారు. పంటలు వేసినప్పటి నుంచి ఫలసాయానికి వచ్చే వరకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘంతో అనుసంధానం చేసి ఇండి - గాప్ సర్టిఫికేట్‌లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పి.ఆదినారాయణ, మాకవరపాలెం మండలం వ్యవసాయ శాఖ మండల అధికారి చిరంజీవి రావు, ఎఫ్‌పీవో సీఈవో సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీ ఉమా ప్రసాద్

ఉత్సాహంగా క్రీడాపోటీలు



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

మునగపాక : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, క్యారమ్స్ వంటి పోటీలను తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. క్విజ్ పోటీలు కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని పీటీలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ

కోటవురట్ల : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని హెచ్‌ఎం ఎం.లక్ష్మి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. ఆర్ట్ ఎడ్యుకేషన్ టీచర్ ఈశ్వరరావు పర్యవేక్షించగా విద్యార్థులు తమలోని ప్రతిభను చాటారు. విజేతలకు పంద్రాగస్టున బహుమతి ప్రదానం చేయనున్నట్టు హెచ్‌ఎం తెలిపారు.



కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: పి.ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పి.ధర్మవరంలో గ్రామంలో ఉదయం 9 గంటల నంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ విద్యుత్ అంతరాయం ఉంటుదని చెప్పారు.ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

యలమంచిలి రూరల్: పురుషోత్తపురం విద్యుత్ సబ్ స్టేషన్ పేరంటాళ్లపాలెం, ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం యలమంచిలి మండలంలో లక్కవరం, పురుషోత్తపురం, పులపర్తి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పీఎస్‌ఆర్‌పేట ఫీడర్ పరిధిలో బయ్యవరం, పీఎస్‌ఆర్‌పేట, మైహోం ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవకాశం మేరకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు.

వేపతో సాగు.. భలే బాగు

- రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే వేప ఉత్పత్తులు
- 300 రకాల కీటకాలకు సింహస్వప్నం

అనకాపల్లి : ఈ ఏడాది మండలంలో 5,600 ఎకరాల్లో వరినాట్లు వేసుకునేందుకు రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ దశలో వరికి చీడపీడ పట్టకుండా ఉపయోగించుకునే వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది 300 రకాల కీటకాలు, సల్జాతి పురుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంధ్రాలను అరికట్టగలదు. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేప నూనె, వేప కషాయం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

ఇంట్లోనే వేప కషాయం.. : వేప కషాయాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేపగింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని కలిపి వినియోగించాలి. వరి పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన మరుక్షణమే ఇలా చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరాకు 20 లీటర్లు పిచికారీ చేస్తే పురుగులు చనిపోతాయి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.



తెగుళ్ల నివారణకు..
వివిధ రకాలైన పంటల్లో తెగుళ్ల నివారణకు వేప మందుల వాడకం ఉపయోగకరం. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికొడను నివారించవచ్చు. వరిపైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్లు చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రోవైరస్ వంటి తెగుళ్లనును నివారించవచ్చు. నీమ్ ఆయిల్ స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించచ్చు. ఈ మందును పిచికారీ చేసినప్పుడు పురుగులకు వికారం కలిగి పైరును నాశనం చేయకుండా ఉంటాయి. విషపూరిత అవశేషాలు ఉండవు. పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగల వంటి జీవరాశులకు హాని కలగదు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com